యువత వ్యసనాల బారిన పడొద్దు

లింగాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాల బారిన పడొద్దని బంజారా దీక్షగురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ అన్నారు. మండలంలోని మోత్తిపటార్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు రామారావు మహారాజ్ చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవా లని చెప్పారు. యువత భక్తిభావంతో ఉండేందుకు దీక్షలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పద్మానానుజాదవ్, ఆడే లక్మానాయక్, మాజీ జడ్పీటీసీ ఆత్మారామ్ మాజీ వైస్ ఎంపీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బెజ్జూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగువాయి గ్రామంలో ఆదివారం గ్రామస్థులు హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానికులు చందాలు వేసుకుని ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పురోహితులు భూమి పూజ సందర్భంగా కలశ పూజ, హోమం, ఇతర పూజలు నిర్వహించారు.

ప్రార్థనలకు ఏర్పాట్లు

సిర్పూర్(టి), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాసాలు ఆదివారం నుంచి ప్రారంభం కావడంతో సిర్పూర్(టి) మండల కేంద్రంలోని మసీదులను ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం వెకువ జాము నుంచి ముస్లింలు రంజాన్ మాసం ఉపవాస దీక్షలను ప్రారంభించారు. మండల కేంద్రంలోని బస్టాండు ఏరియా, డౌనల్ ఏరియా, పేట్‌మహిళ కాలనీల్లోని ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబు చేశారు. పరిసరాలను శుభ్రం చేయించారు. ఆయా మసీ దులలో మొదటి నుంచే ఇఫ్తార్ విందులు ప్రారంభమయ్యాయి.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, వసంతరావు, కార్తీక్, దీపక్, మారుతి, శైలు, శంకర్, జుగాది రావు, భీంరావు, గోపాల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రేపు బెజ్జూరులో వైద్య శిబిరం


ఆసిఫాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో జిల్లా అటవీ శాఖతో పాటు సింగరేణి కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శిబిరానికి జనరల్ మెడిసిన్, కీళ్ల వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. మందులు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.

అసౌకర్యాలే అసలు పరీక్ష

- ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సమస్యల తిష్ఠ
- పనిచేయని రక్షితనీటి ప్లాంట్లు
- వినియోగంలో లేని మూత్రశాలలు
- 5 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు



ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల


బెజ్జూరులో నిరుపయోగంగా ఉన్న మూత్రశాలలు

ఆసిఫాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పరీక్షలకు సన్న ద్ధం అవుతున్నారు. మరోవైపు అధికారులు పరీక్ష కేంద్రాలను గుర్తించి వాటిలో ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా వా టిలో పలు కేంద్రాలలో అసౌకర్యాలు విద్యార్థుల సహ నాన్ని పరీక్షించేలా ఉన్నాయి. అధి కారులు వసతులు కల్పిస్తే వారికి ప్రయో జనకరంగా ఉంటుంది. పలు కేం ద్రాల్లో సరిపడా మూత్రశాలలు లేవు. కళాశాలకు ప్రహరీ నిర్మాణం లేక పోవడంతో పరిసరాల్లో అపరిశు భ్రత నెలకొంది.

• 19 పరీక్ష కేంద్రాలు..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూరు, తిర్యాణి, దహె గాం, జైనూరు, కెర మెరి, వాంకిడి, రెబ్బెన ప్రభుత్వ జూని యర్ కళాశాలలతో పాటు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, పీటీజీ బాలుర కళాశాల, ప్రభుత్వ ఆదర్శ కళాశాల, సిర్పూర్ (యూ)లోని ప్రభుత్వ ఆదర్శ కళాశాల, కాగజ్ నగర్ గన్నారంలోని జ్యోతిబాపూలే బాలికల కళాశాల, కాగజ్‌నగర్‌లోని వివేకానంద జూనియర్ కళాశాల, వసుంధర జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో కలిపి మొత్తం 10,054 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్‌తో కలిసి 4,758, ద్వితీయ సంవత్సరంలో 5,296 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా ఈనెల 5 నుంచి 22వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు హాజరు కానున్నారు.

• కేంద్రాల పరిస్థితి ఇది..

- ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. అప్రోచ్‌రోడ్డు ని ర్మించకపోవడంతో అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది.
- రెబ్బెన కళాశాల చుట్టూ ప్రహరీగోడ లేక ఇబ్బందులు తప్పడంలేదు.
- బెజ్జూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వి ద్యార్థులు మూత్రానికి ఆరుబయటకే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కళాశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో బోరుబావి నీటినే తాగాల్సి వస్తుంది. ప్రహరీ అసంపూర్తిగా ఉంది.


దహెగాంలో పని చేయని రక్షితనీటి ప్లాంట్

- కౌటాల ప్రభుత్వం కళాశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ప్రహరీ పూర్తి స్థాయిలో నిర్మాణానికి నోచుకోలేదు.
- జైనూరు ప్రభుత్వ కళాశాలలో మూత్రశాలలు సరిపడా లేకపోవడం, ప్రహరీ లేకపో వడంతో తరచూ పశువులు కళాశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి.
- దహెగాం ప్రభుత్వ కళాశాలలో ఆర్వో ప్లాంట్ చెడిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. బయటి నుంచే తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. కళాశాలలోని వరండాతో పాటు గదులలో గచ్చు పూర్తిగా కుంగి పోయింది.
- కెరమెరి ప్రభుత్వ కళాశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణం చేపట్ట లేదు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం



శిథిలావస్థకు చేరిన భవనం

కౌటాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కౌటాల మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. మొదటి రెగ్యులర్ లైబ్రేరియన్ ఉండడంతో పాటు సౌకర్యాలు కల్పించారు. దీంతో నిరుద్యోగులకు ఎంతో అందుబాటులో ఉండేది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేరు. దీంతో పాటు గ్రంథాల య భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాఠకులు, నిరుద్యోగులు గ్రంథాల యానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కౌటాల, చింతలమానేపల్లి మండలాల్లోని యువతకు అందుబాటులో ఉన్న గ్రంథాలయాన్ని పట్టించుకోక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని యువత గ్రంథాలయంలో పుస్తక పఠనం, పోటీ పరీక్షల కోసం గ్రంథాలయానికి వెళ్తుంటారు. ప్రస్తుతం ఆ గ్రంథాలయం సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయం భవనం నిర్మించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉపయోగపడేలా..



నిరుద్యో గులకు ఉపయోగ పడేలా గ్రం థాలయానికి నూతన భవనం నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుం టున్నందున గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి.

- మొర్లె వేణు, కౌటాల

ఆదివాసీలకు అండగా ఉంటాం
- ఏఎస్పీ చిత్తరంజన్


యువతకు వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం తిర్యాణి మండలంలోని గోవెన, కుర్సిగూడ, నాయకపుగూడ, లింగగూడ గ్రామాల్లో కాలినకడన పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత, ప్రజలు మావోయిస్టుల ప్రలోభాలకు లోను కావద్దన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా ప్రభుత్వం, పోలీసుల ద్వారా పరిష్కరించు కోవాలన్నారు. యువత మావోయిస్టుల మాటలకు ఆకర్షితులు కావద్దని చెప్పారు. లక్ష్యం చేరుకునేందుకు యువత చదువుపై దృష్టి పెట్టాలన్నారు. యువత అసాంఘిక కార్యక లాపాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న శంభురావు అనే బాలుడిని పరామర్శించారు. త్వరలోనే మెరుగైన చికిత్స అందే విధంగా పోలీసు శాఖ తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సీఐ బుద్దే స్వామి, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై రామకృష్ణ

సిర్పూర్(యు), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు అన్నారు. వారం రోజులుగా మండల కేంద్రంలోని మహాదేవ్ జాతరలో కొనసాగుతున్న కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. కెరమెరి అంబారావుగూడ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండో బహుమతి సిర్పూర్(యు) మండలంలోని నేట్నూర్ జట్టు కైవసం చేసుకుంది, లింగాపూర్ మండలంలోని జంగుగూడ జట్టు మూడో బహుమతి గెలుచుకుంది. గెలుపొందిన జట్లుకు ఎస్సై రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆత్రం దౌలత్‌రావు, వైస్ చైర్మన్ ఆత్రం గోవింద్‌రావు, పూజారి ఆత్రం శ్రీరావు, నాయకులు ఆత్రం భీంరావు, కుమ్ర భీంరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

రెబ్బెన, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పని చేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆదివారం ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ ఆయన చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఎస్ఈ పాషా, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బోరు నీరే దిక్కు

- నెల రోజులుగా నిలిచిన మిషన్ భగీరథ నీరు


బోరు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

సిర్పూర్(టి), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారులకు వేసవి ప్రారంభం కాగాన రక్షిత మంచినీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా పలు కాలనీలో ప్రజలకు నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ, బస్టాండు ఏరియాలో నెల రోజులుగా భగీథ నీరు సరఫరా కావడం లేదు. పైప్‌లైన్‌లో తలెత్తిన సమస్య వల్లే నీరురావడం లేదని చెబు తున్నారు. దీంతో ఆయా కాలనీ వాసులు బోరు, వాగుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఫిల్టర్ నీటిని కొనలేక బోరు నీటినే వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబం ధిత శాఖాధికా రులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఈవో బి తిరుపతిని వివరణ కోరగా మండల కేంద్రం లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సరఫరా కోసం మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్‌కు కొత్త ప్లేట్లు అమర్చి నప్పటికీ నీరు సరఫరా కావడం లేదని చెబు తున్నారు. ఆయా కాలనీల్లో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందొద్దని ఆయన కోరారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం గుర్తింపు

కాగజ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని 3వ ప్లాట్ ఫాం రైలు పట్టాలపై ఆదివారం మహిళ మృతదేహాన్ని గుర్తించామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. మహిళ వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. తెలుపు, ఎరుపు రంగు పంజాబీ డ్రెస్ ధరించిందని, వయస్సు 40 సంవత్సరాలు పై బడి ఉంటుందని తెలిపారు.. గుర్తు తెలియని రైలు ఢీ కొని మృతి చెందినట్లు భావిస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చులో గదిలో భద్రపరిచామని తెలిపారు.

అసంపూర్తిగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

- ఏళ్లు గడిస్తున్నా పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ప్రజల అవస్థలు


కాగజ్‌నగర్‌లో మెట్లు నిర్మించని రైల్వే ఓవర్ బ్రిడి

కాగజ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో పూర్తి చేయాల్సిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పూర్తి కావడం లేదు. సిర్పూరు నియోజకవర్గంలో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఇంకా అసంపూర్తి దశలోనే మగ్గుతున్నాయి. కాగజ్ నగర్ పట్టణంలో ఎంజీ రోడ్డుపై నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసినప్పటికీ మెట్ల నిర్మాణం ఇంకా చేపట్టలేదు. దీంతో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ల నిర్మాణం చేపట్టాలని పలుమార్లు రైల్వే జీఎంకు వినతిపత్రాలు సమర్పించినా ఇంత వరకు దాని ఊసే లేదు. అలాగే వేంపల్లి-సిర్పూరు(టి) ప్రధాన రహదారి ఉంది. ఈ మార్గంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై 2016లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. బ్రిడ్జిపైన అప్రోచ్ రోడ్డు పూర్తిగా నిర్మించక పోవటంతో ప్రయాణికులు కంకర తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము లేస్తోంది. దుమ్ముతో ఆ రోడ్డు మీదుగా వెళ్లే వాహన, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు.

రూ. 30 కోట్లతో..

సిర్పూరు-కాగజ్‌నగర్ ప్రాంతాలకు మధ్య ఉన్న వేంపల్లి వద్ద 2016లో రూ. 30 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను ప్రారంభించారు. ఈ బ్రిడి నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు పూర్తి స్థాయిలో రాక పోవడంతో జాప్యం జరిగింది. రెండేళ్ల క్రితం పూర్తి స్థాయిలో అనుమతులు ఇవ్వడంతో నిధులు ఉన్న మేరకు పనులు పూర్తి చేశారు. ఓవర్ బ్రిడ్జిపై భాగంలో ప్రధాన రోడ్డు, అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ రెండు రోడ్లకు సంబంధించిన నిధులు సకాలంలో విడుదల కాక పోవటంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం గుంతల పడిన రోడ్డు మీదుగానే వాహనదారులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే ఓవర్ నిర్మాణం 2014లో చేపట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. కాని మెట్ల పనులను పట్టించుకోలేదు. మెట్ల నిర్మాణం పూర్తి చేయక పోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి ఆనుకొని ఉన్న సీబాపు కాలనీ, కాపువాడ, నూరానీమజీదు ఏరియాలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చినా కాగజ్‌నగర్‌కు చేరుకోవాలంటే రైల్వే ఓవర్ బ్రిడ్జి వంతెనపై నుంచి కనీసం రెండు కిలోమీటరు దూరం నుంచి రావాల్సిన పరిస్థితి నెలకొంది. 2017లో రైల్వే జీఎం పర్యటన సందర్భంగా స్థానికులు సమస్య ప్రస్తావించినా ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోతున్నారు.


సిర్పూరు(టి) రైల్వే ఓవర్ బ్రిడ్జిపై గుంతలమయంగా మారిన రోడ్డు

రోడ్డు పనులు పూర్తి చేయాలి..



కాగజ్‌నగర్-సిర్పూరు(టి) మధ్యలో ఉన్న వేంపల్లి సమీపంలో బ్రిడ్జిపై భాగంలో రోడ్డు పనులు పూర్తి చేయాలి. రోడ్డు పనులు వదిలేయడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్లపై భారీ వాహనాలు వెళుతుండడంతో దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-సిద్దం శ్రీనివాస్, కాగజ్‌నగర్

మెట్లు నిర్మించాలి..



రైల్వే ఓవర్ బ్రిడ్జికి మెట్లు నిర్మించాలి. కాగజ్‌నగర్ బ్రిడ్జికి మెట్లు లేకపోవడంతో సమీపంలో ఉన్న కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సీ బాపు కాలనీ, నూరా మజీదు కాలనీవాసులు కాగజ్‌నగర్‌కు ఆన ుకొని ఉంటారు. కాగజ్‌నగర్‌కు రావాలంటే ఆర్ఓబి వంతెనపై నుంచి రావాల్సిన పరిస్థితి ఉంది.

- అన్నం నాగార్జున, కాగజ్‌నగర్

రెండు ఆటోలు ఢీ.. ఒకరి మృతి

భీమారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెపల్లి వాగు వద్ద ఆదివారం సాయంత్రం రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మద్దికల్ గ్రామానికి చెందిన చింతం పెంటయ్య (60) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్దికల్ గ్రామానికి చెందిన దాగం సర్వేశ్వర్ తన ఆటోలో కుమ్మరి శంకర్ ,అతడి భార్య భాగ్య, కుమారుడు బాబుతో పాటు ప్రయాణికులు ఎన్నం బానేష్, మానస, చింతం పెంటయ్యలతో మద్దికల్ వైపు వెళ్తున్నాడు. మద్దికల్ గ్రామం నుంచి ఆకుదారి సారయ్య తన ఆటోలో వస్తుండగా ఆరేపల్లి వాగు వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మద్దికల్ నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ పక్కన కూర్చున్న పెంటయ్య తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రెండు ఆటోల డ్రైవర్లు సర్వేశ్వర్, సారయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో గాయపడిన వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంత సమయం అయితే తన ఇంటికి చేర్చాల్సిన పెంటయ్య మృతిచెందడంతో కుటుం బీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మిగితా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ముత్తయ్య తెలిపారు.

ఆధార్ అవస్థలు



- ఏజెన్సీలో కేంద్రాలు లేక గిరిజనుల ఇబ్బందులు
- అత్యవసరం ఉన్న వారు ఇతర చోట్లకు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

జైనూర్/లింగాపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అన్నింటికీ ఆధార్ ప్రామాణికంగా మారింది. పుట్టిన చిన్నారి మొదలు పండుటాకుల వరకు దీని అవసరం పడుతోంది. కార్డులో వివరాలన్నీ పక్కగా ఉండాలి. లేకుంటే ఇబ్బందులు తప్పడం లేదు. తప్పుల సవరణలు, మార్పులు, చేర్పులు వివరాలను నవీకరించెందుకు (అప్‌డేట్) ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లాల్సిందే. అయితే ఏజెన్సీ మండలాల్లో కేంద్రాలు సరిపడా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వేరే మండలాలకు ఉదయమే వెళ్లి టోకెన్లు తీసుకోని గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

జైనూర్ మండల కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రం నిర్వాహణ అనుమతిని కొద్ది నెలల కిందట అధికారులు రద్దు చేశారు. లింగాపూర్ మండల కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రం సాంకేతిక కారణాలతో మూసివేశారు. సిర్పూర్(యు) మండల కేంద్రంలో మాత్రమే ఆధార్ కేంద్రం ఒక్కటే నిర్వాహణలో ఉంది. అయితే మారుమూల గ్రామాల ప్రజలు ఈ కేంద్రం చుట్టూ తిరిగినా పనులు కావడం లేదు. మార్పులు, చేర్పులు అత్య వసరం ఉన్న వారు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు పరుగులు తీస్తున్నారు. దూరభారం, వ్యయ ప్రయాసాలతో వారు సతమతమవుతున్నారు. ఒక్కోసారి రోజంతా నిరీక్షించినా పని జరగక వెనుదిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి జైనూర్‌లో నూతన ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని, లింగాపూర్‌లో నమోదు కేంద్రాన్ని పునః ప్రారంభించాలని గిరిజనులు కోరుతున్నారు.

అపార్‌కు కష్టాలు..

విద్యార్థులకు అపార్ నమోదుకు సైతం కష్టాలు తప్పడం లేదు. నూతన జాతీయ విధానం ప్రకారం విద్యార్థికి 12 అంకెల జీవిత గుర్తింపు అపార్ కార్డులు జారీ చేస్తోంది. ఈ కార్డులో విద్యార్థుల వివరాలు పుట్టిన తేదీ, ధ్రువ పత్రాలు, ఆధార్‌కార్డులోనూ పేరు ఒకే విధంగా ఉండాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చాల మంది విద్యార్థుల వివరాలు ఆధార్ కార్డులో సరిగ్గా లేకుండా పోయాయి. దీంతో వారంత కార్డు నవీకరణ చేయాల్సి వస్తోంది. దీంతో కేంద్రాలకు వెళ్లక తప్పని పరిస్థితి. అక్కడ రద్దీ ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. అపార్ నమోదుకు గడువు ముగిసే ఆవకాశం ఉందని అధికారులు చెబుతండడంతో తల్లిదండ్రులు పనులు మానుకుని కేంద్రాలకు పరుగులు పెడతున్నారు.

పది సార్లు వెళ్లినా టోకెన్ దొరకలేదు..



నా పిల్లల ఆధార్ కార్డుల నవీకరణ కోసం పది సార్లు ఉట్నూర్‌కు వెళ్లాను. అక్కడకు వెళ్లి క్యూలో నిలబడినా టోకెన్ దొరకలేదు. మరుసటి రోజు రావాలని నిర్వాహకులు సూ చించారు. పది రోజులు తిరిగినా పని కా లేదు. అధికారులు సమస్య పరిష్కరించాలి.

\- రమేశ్, లింగాపూర్

ఆధార్ కేంద్రం మూతతో ఇబ్బందులు..



జైనూర్‌లో ఆధార్ నమోదు కేంద్రం మూతపడడంతో ఇబ్బందులు పడుతున్నాం. సిర్పూర్(యు) ఆధార్ కేంద్రంలో నిత్యం జనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఉట్నూరు లోను ఇదే పరిస్థితి. జైనూర్‌లో నూతన ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి.

\- ఉయిక జ్ఞానేశ్వర్, పవర్‌గూడ

మహిళలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చడమే ధ్యేయం

- ఐకేపీ ఏపీఎం మహేష్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఐకేపీ ఏపీఎం : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి?

ఐకేపీ ఏపీఎం : మండలంలో 708 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 7.812 మంది సభ్యులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారా ?

ఐకేపీ ఏపీఎం : ఏటా స్త్రీనిధి రుణాలు సంఘ సభ్యులకు అందిస్తున్నాం. ఈ ఏడాది ఇప్పటివరకు 91 లక్షల 77 వేలు స్త్రీనిధి రుణాలు అందించాం.

ఆంధ్రజ్యోతి : బ్యాంకు లింకేజీ రుణాలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఐకేపీ ఏపీఎం : బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈఏడాది 18 కోట్ల 19 లక్షల లక్ష్యం ఉంది. కాగా లక్ష్యాన్ని మించి 20 కోట్ల 18 లక్షల బ్యాకు లింకేజీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి : తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారా ?

ఐకేపీ ఏపీఎం : స్వయం సహాయక సంఘ సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. 95 శాతం సంఘ సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తున్నారు.

\- వాంకిడి, (ఆంధ్రజ్యోతి)

అప్రోచ్ రోడ్డు నిర్మాణం ఎప్పుడు?

- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

ఆసిఫాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి బైపాస్ రహదారిపైకి చేరుకునేందుకు మధ్యలో ఉన్న అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి నోచుకోవడంలేదు. పట్టణం నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఈరోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జిల్లా కేంద్రంలోని సెంటర్ నుంచి అర కిలోమీటరు దూరంలో ఉన్న ఈరోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



అధ్వానంగా మారిన అప్రోచ్ రోడ్డు

వర్షాకాలంలో తీవ్ర అవస్థలు..

వర్షాకాలంలో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి నడవడానికి సైతం వీలు లేకుండా పోతోంది. జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లు గడుస్తోంది. అధికారులు మాత్రం అప్రోచ్‌రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని గుండి ఏరియా నుంచి వాహనదారులు బైపాస్ రోడ్డుకు చేరుకునేందుకు మధ్యలో సుమారు అరకిలో మీటరు మేర పనులు చేపట్టాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈరోడ్డు మీదుగానే అన్ని వాహనాలు రాకపోకలు సాగించేవి. వర్షకాలంలో భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో ప్రస్తుతం వాహనాలన్నీ అరె సంక్షేమ సంఘ భవనం ఎదుట నుంచి యూ టర్న్ తీసుకొని తిరిగి గుండి ఫ్లైఓవర్ కింది నుంచి జాతీయ రహదారిపైకి చేరుకోవల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాలు జాతీయ రహదారిపైకి చేరుకునేందుకు దూరం పెరిగిపోయింది. అప్రోచ్ రోడ్డు నిర్మాణపు పనులు చేపడితే నేరుగా జాతీయ రహదారిపైకి చేరుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అప్రోచ్‌రోడ్డు పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అప్రోచ్‌రోడ్డు నిర్మించాలి..



ఆసిఫాబాద్ నుంచి బైపాస్ రోడ్డుకు చేరుకునే అప్రోచ్‌రోడ్డు వెంటనే నిర్మించాలి. రోడ్డు నిర్మాణం చేపట్టక పోవడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనాలు బైపాస్‌రోడ్డుకు తిరిగి పోవాల్సిన అవసరం ఉండదు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

\- ఎరుబోతు ప్రదీప్, ఆసిఫాబాద్

వంద శాతం ఫలితాలపై దృష్టి

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మందమర్రిరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఈ నెలలో జరిగే వార్షిక పరీక్షల నేపథ్యంలో పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక స్టడీ మెటీరియల్, అభ్యాస దీపికలను అందజేశారు. పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతిలో 100 మంది విద్యార్థులు ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా మండలంలో ఆదర్శ పాఠశాల మెరుగైన ఫలితాలు సాధిస్తూ వస్తోంది.



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ..



మంచి ఫలితాలు సాధించేందుకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

\- సారా తస్లీమా , ప్రిన్సిపాల్

లాంగ్‌వాల్ ప్రాజెక్టును అడ్డుకోవాలి

బెల్లంపల్లిరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు సమిష్టిగా సింగరేణి యాజమాన్యం చేపడుతున్న ఓపెన్‌కాస్టు, శాంతిఖని గని లాంగ్‌వాల్ ప్రాజెక్టును అడ్డుకోవాలని కార్మిక సంఘం నాయకుడు రాజన్న కోరారు. మండలంలోని పెర్కపల్లి గ్రామంలో ఆదివారం లాంగ్‌వాల్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాసిత రైతులతో మాట్లాడారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు స్థానిక నాయకులు జెండాలు, ఎజెండాలను పక్కనబెట్టి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల రైతుల జీవనాధారం పూర్తిగా దెబ్బతింటుందని చెప్పారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టు 700 మీటర్ల నుంచి 900 మీటర్ల లోతులో తీయడం వల్ల గని పరిసరాల్లో బోరు బావులు ఇంకిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీన్ని అడ్డుకోవడం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.



కార్మికుల శ్రేయస్సే ధ్యేయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. ఆదివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. కొన్ని సంఘాలు తమ యూనియన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. కానీ వారు కార్మికుల గురించి ఏనాడు పోరాడిన పాపాన పోలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే చాలా సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాజ్‌కుమార్ మాట్లాడుతూ తాము ఈ నెల 5న సీఎండీ ఎన్. బలరాంతో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో పలు డిమాండ్లను ఆయన ముందుంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె. సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

రెస్క్యూ సిబ్బందికి తగిన వసతులు కల్పించాలి

శ్రీరాంపూర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సమీపంలోని దోమల పెంట వద్ద గల ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులను రక్షించేందుకు తరలివెళ్లిన సింగరేణి రెస్క్యూ సిబ్బందికి తగిన వసతులు కల్పించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 200 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది సహాయం చేసేందుకు వెళ్తే వారికి మౌలిక వసతులు కల్పించడం లేదని తెలిపారు.

మిగిలింది 29 రోజులే

- బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి చేరువలో గనులు
- శ్రమిస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం మగింపునకు ఇంకా 29 రోజులే మిగిలి ఉంది. ఈ గడువులోగానే నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల సింగరేణి సీఎండీ ముఖ్యమైన ఏరియాల్లో పర్యటించి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. ఈ జోష్‌తో ఫిబ్రవరి నెలలో ఉత్పత్తి కాసింత పెరిగింది. ఇక మిగిలిన మార్చిలో సైతం పూర్తి స్థాయిలో శ్రమించి లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



గనిలో పరిశీలిస్తున్న సీఎండీ బలరాం(ఫైల్)

లక్ష్యం 72 మిలియన్ టన్నులు

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ మెట్రిక్ టన్నులు. ఈ ఉత్పత్తిని సాధించేందుకు మొదటి నుంచి ఒక ప్రణాళికతో పని చేయాలని సీఎండీ సూచిస్తున్నారు. ఇందులో భాగంగా రోజువారీగా, గనులవారీగా. ఏరియావారీగా, నెల వారీగా ఉత్పత్తి చేరుకునేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు కంపెనీ వ్యాప్తంగా 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సంస్థ సాధించింది. లక్ష్యం చేరుకోవాలంటే ఇంకా మిగిలిన రోజుల్లో 12 మిలియన్ టన్నులు వెలికితీయాల్సి ఉంటుంది. ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వర్షాల కారణంగా ఓసీపీలలో బొగ్గు ఉత్పత్తి గతేడాది తక్కువగా వచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో ఉత్పత్తిలో వెనుకబాటు ఉన్నా క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది.

డిసెంబరు నెలలో..

గతేడాది డిసెంబరు నెలలో గతంలో ఎన్నడూ లేనివిధంగా శ్రీరాంపూర్ ఏరియాలోని అండర్‌గ్రౌండ్ గనుల్లో 90 శాతం, ఉపరితల గనుల్లో 121 శాతం ఓవరాల్‌గా 114 శాతం ఉత్పత్తిని సాధించారు. డిసెంబరు 27న ఒక్కరోజే మొత్తంగా 28 వేల 509 మెట్రిక్ టన్నులను, 30వ తేదీన అండర్ గ్రౌండ్ గనుల్లో 5 వేల 578 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేశారు. 27వ తేదీన ఒక్క రోజే 29 వేల 215 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి 7 రేకుల బొగ్గును రవాణా చేశారు. డిసెంబరులో అత్యధికంగా 6 లక్షల 56వేల 737 టన్నులు వెలికితీసి 157 రేకుల బొగ్గును తరలించారు.

ప్రణాళికతో ముందుకు..

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తికి సీఎండీ స్థాయి నుంచి కింది స్థాయి అధికారుల వరకు సరైన ప్రణా ళికలతో ముందుకు వెళ్తున్నారు. రక్షణ పక్షోత్సవాలు, మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశాల ద్వారా ఉత్పత్తి మెరుగైంది. అంతేకాకుండా ఉత్పత్తి మెరుగుపడేందుకు, ఉద్యోగుల్లో ఉత్సాహం నింపేందుకు జనవరి 12 నుంచి మూడు రోజుల పాటు సీఎండీ బలరాం బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, ఆర్‌జీ-1, 2, 3, ఏఎల్‌పీ, భూపాలపల్లి ఏరియాల్లో ఉన్న 20 గనులలో పర్యటించారు. వేల మంది కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడి, ఉత్పత్తి పెంచేందుకు ఏం చర్యలు తీసుకోవాలి, ఎలాంటి సమస్యలున్నాయి, ఎలాంటి సౌకర్యాలు కావాలనే విషయాలను ఆయన ఆరా తీశారు. ఉద్యోగుల సూచనలను అమలు చేయడంతో ఫిబ్రవరి నెలలో సంస్థ లక్ష్యం చేరువకు వెళ్లగలిగింది. ఫిబ్రవరి నెలాఖరుకు బెల్లంపల్లిలో 38,50,000 లక్ష్యానికి గానూ 32,07,007 టన్నులు ఉత్పత్తి చేశారు. 83.3 శాతం నమోదైంది. మందమర్రిలో 34,60.000కి 24,53,012 టన్నులు ఉత్పత్తి చేశారు. 70.9 శాతం సాధించారు. శ్రీరాంపూర్‌లో 63,10,000కి గానూ 49,57,145 టన్నులు సాధించారు. 78.6 శాతం ఉత్పత్తి పూర్తయిందని అధికారులు తెలిపారు.

50 ఏళ్లుగా సైకిల్‌పైనే సేవలు

- ఇంటింటా తిరుగుతూ వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీ



సైకిల్‌పై వెళుతున్న ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకటాచారి

రెబ్బెన, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు 50 ఏళ్లుగా సైకిల్‌పై ఇంటింటికీ తిరుగుతూ వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో ద్విచక్ర వాహనం లేనిదే బయటికి పోలేని పరిస్థితి.. మారుతున్న కాలానికి కార్లలో తరుచూ వెళ్లడం చూస్తుంటాం. రెబ్బెన మండలం గోలేటి గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన బెజ్జంకి వెంకటాచారి 50 ఏళ్లుగా ఆర్‌ఎంపీగా వైద్య సేవలు అందిస్తున్నారు. కాళ్లకు చెప్పులు లేకుండానే సైకిల్ తొక్కుతు పొద్దంతా తిరుగుతూ అస్వస్థతకు గురైన వారికి ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నారు. గోలేటి పంచాయతీ పరిధిలోని కైరిగూడ, అమీన్‌గూడ, దుగ్గాపూర్, సోనాపూర్, గోలేటి తదితర గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యుడు బెజ్జంకి వెంకటచారి అందరికి పరిచితుడు. నొదుటిపై పెద్ద బొట్టు పెట్టుకొని వైద్యం చేస్తుంటారు. దీంతో బొట్టు డాక్టర్‌గా మంచి పేరుంది. నిత్యం సైకిల్‌పైనే ఆయా గ్రామాల్లో తిరుగుతూ వైద్య సేవలు అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

జ్యోతినగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ లేబర్ గేటు సమీపంలోని రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నూనె సాగర్ (30) అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. రామగుండం నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన సాగర్‌ను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాగర్ మృతి చెందాడు. సాగర్ సింగరేణి ఆర్‌జీ 1, 2వ ఇంక్లయిన్ గనిలో మైనింగ్ సర్దార్‌గా పని చేస్తున్నాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన్య ప్రాణుల దాహార్తి తీరుస్తున్నాం

జైపూర్ ఎఫ్ఎస్వో రామకృష్ణ సర్కార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : వన్యప్రాణులకు నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారా?

ఎఫ్ఎస్వో : అడవు ల్లో వన్య ప్రాణుల దాహార్తిని తీర్చడా నికి నీటి తొట్టిలను ఏర్పాటు చేశాం. సిబ్బంది చేత పర్యవేక్షిస్తూ తొట్టిల్లో నీరు ఎప్పుడు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : అడ వికి నిప్పు పెడితే ఎలాం టి చర్యలు తీసుకుంటున్నారు?

ఎఫ్ఎస్వో : తునికాకు సేకరణ, ఇప్ప పువ్వు సేకరణ కోసం వెళ్లి అడ వికి నిప్పు పెడితే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో పులి సంచరిస్తోంది. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారా?

ఎఫ్ఎస్వో : మండలంలో పులి సంచరిస్తున్నట్లు పాదము ద్రల ద్వారా గుర్తించాం. అటవీ సిబ్బందితో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అడవుల్లోకి ప్రజలు ఎవరు వెళ్ల వద్దని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆర్వోఎఫ్లో సాగు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎఫ్ఎస్వో : ఆర్వోఎఫ్లో సాగు చేస్తే అటవీ శాఖ తరుపున కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరం అయితే కేసులు నమోదు చేస్తాం.

- జైపూర్, ఆంధ్రజ్యోతి

జీవితంలో 'సెట్' కావాలంటే..

మీకోసం

- ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసిన ప్రభుత్వం
- విద్యార్థుల సన్నద్ధతే కీలకం



కోటపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఇక ముందున్నది అంతా పరీక్ష కాలం.. పది, ఇంటర్, డిగ్రీ వార్షిక పరీక్షలకు తోడు ప్రవేశ పరీక్షల తేదీలు కూడా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థులు కోరుకున్న విద్యాసంస్థలు, కోర్సుల్లో చేరాలనేది వారి ముందున్న లక్ష్యం. అయితే ఇందుకు సన్నద్ధం అవడమే కీలకంగా మారనుంది. ఓ వైపు వార్షిక, మరో వైపు ప్రవేశ పరీక్షల్లో రాణించేందుకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాయమత్తమవ్వాలి. వార్షిక పరీక్షల పాఠ్యాంశాల కంటే అర్హత పరీక్ష ఇందుకు కొంత భిన్నంగా ఉంటుంది. విద్యార్థులు వారికి ఇష్టమైన కోర్సు, ఆసక్తి గల కళాశాలల్లో సీటు దక్కాలంటే ప్రతిక్షణం విలువైనదిగా భావించాలి. అప్పుడే వారి కల సాకారం అవుతుంది. పోటీ పరీక్షల్లో సరైన సమయంలో సరైన సమాధానం గుర్తించిన వారే విజేతగా నిలుస్తారు. ఇందుకు పోటీ పరీక్షల్లో కష్టపడాల్సి ఉంటుంది.

● ఈ అంశాలు కీలకం...

కొన్ని ప్రవేశ పరీక్షల్లో మినహా విధిగా జనరల్ నాలెడ్జ్ పరీక్షిస్తారు. అందుకే అభ్యర్థి గత ప్రశ్న పత్రాలను పరిశీలించి ప్రశ్నల సరళిపై ఒక అంచనాకు రావాలి. ఒక మార్కు కోసం నాలుగు సమాధానాలు గుర్తించడం, జతపర్చడం, లాంటి ఎక్కువ ప్రశ్నలు తక్కువ మార్కులు అనే విషయాన్ని గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన, అంతర్జాతీయ సదస్సులు, రాజ్యాంగ సవరణలు, తెలంగాణ ప్రభుత్వ విధానాలు, వర్తమాన అంశాల్లో, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను గుర్తించాలి. ఇదే కాకుండా అర్థమెటిక్, రీజనింగ్ ప్రశ్నలు అధిక సమయాన్ని తీసుకుంటే మిగితా వాటికి సమాధానాలు గుర్తించే అవకాశం కోల్పోయినట్లే. సమయ నిర్వహణ ఎంతో కీలకం. ఎలాంటి ఆందోళనలు ఉండకుండా ప్రశాంతంగా ఉండడంతో పాటు సరైన నిద్ర, ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.

● ఇలా చేస్తే ప్రయోజనం...

తొలుత ప్రతి అంశంపై పట్టు సాధించేలా చదవాలి. అర్థం కానివి. పూర్తిగా కఠినమైనవి వదిలి మిగితా అంశాలను వంద శాతం అర్థవంతంగా చదవాలి. రోజులు గడుస్తుంటే పరీక్ష సమీపిస్తుందనే భయం ఉంటుంది. సిలబస్ ప్రకారం ఉత్తమ అంశాలపై ఒక అవగాహన వచ్చిన తర్వాత, పునశ్చరణ, పరీక్షల సాధన వంటివి ఒక క్రమ పద్ధతిలో అనుసరిస్తే ప్రయోజనం కలుగుతుంది.

- ఉదయం 5 గంటలకు నిద్రలేవాలి.
- 6 నుంచి 7 గంటల వరకు గత రాత్రి చదివిన అంశాల రివిజన్ చేసుకోవాలి.
- 7 నుంచి 10 గంటల వరకు కఠిన అంశాల పఠనం.
- 10 నుంచి 12 గంటల వరకు గ్రూప్ చర్చలు,
- మధ్యాహ్నం 1 నుంచి 3 వరకు సందేహాల నివృత్తి అనుభవజ్ఞుల సలహాలు, నిపుణుల శిక్షణ.
- 3 నుంచి 6 గంటల వరకు గత పరీక్షల ప్రశ్న పత్రాలు సాధన.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

పరీక్ష	కోర్సులు	పరీక్ష తేదీలు
ఎప్సెట్	అగ్రికల్చర్, ఫార్మసీ	ఏప్రిల్ 29,30
ఎప్సెట్	బీటెక్	మే 2నుంచి5
ఈసెట్	బీటెక్, బీఫార్మసీలోకి లేటరల్ ఎంట్రీ	మే 2
ఎడ్సెట్	బీఈడీ	జూన్ 1
లాసెట్	ఎల్ఎల్బీ,ఎల్ఎల్ఎం	జూన్ 6
ఐసెట్	ఎంబీఏ, ఎంసీఏ	జూన్ 8,9
పీజీఈసెట్	ఎంటెక్, ఎంఫార్మసీ తదితర కోర్సులు	జూన్ 16 నుంచి 19
పీఈసెట్	డీపీఎడ్, బీపీఎడ్	జూన్ 11,14

- 6నుంచి 10 గంటల వరకు అప్పటి వరకు చది విన అంశాలను మననం చేసుకోవడం.
- రాత్రి 10 నుంచి 11 గంటల వరకు చదివితే లైఫ్లో సెట్ కావచ్చు.

ఇసుక అక్రమంగా తరలింపు

● అభివృద్ధి పనుల పేరిట విచ్చల విడిగా రవాణా ● గుడిరేవు శివారులో భారీగా డంపింగ్



గుడిరేవు గోదావరి తీరంలో ట్రాక్టర్లలో ఇసుకను నింపుతున్న దృశ్యం

దండేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా ఇసుక తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం గోదావరి తీరం నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి నది తీరాల నుంచి ఇష్టారీతిన తోడుకుని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. నదిలో కొద్ది పాటి నీరున్న చోట ఇసుకను తొడేసి తెప్పల మీద తీసుకొస్తూ ఒడ్డునపై పోసి దాన్ని జల్లెడ పట్టి సన్నం ఇసుకను ట్రాక్టర్లలో నింపుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట ఇసుకను ట్రాక్టర్లో దర్జాగా నింపుకుని తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ట్రాక్టర్ ద్వారా ఇసుకను నింపుకుని గుడిరేవు గ్రామ సమీపంతో పాటు వివిధ గ్రామాల్లో భారీగా డంపింగ్ చేస్తున్నారు. దీంతో గోదావరి నదిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఇప్పటికైన సంబంధింత శాఖల అధికారులు స్పందించి అక్రమంగా ఇసుకతో తరలిస్తున్న వాహనాలను పట్టుకుని, గోదావరినదిలో తవ్వాకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గుడిరేవులో గ్రామ సమీపంలో భారీగా ఇసుక కుప్ప నిల్వలు

కఠిన చర్యలు తీసుకుంటాం

సంధ్యారాణి దండేపల్లి తహసీల్దార్

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తప్పవు. ఇంటి అసరాలకు ఇసుక అవసరం ఉంటే మా నుంచి అనుమతి తీసుకోవాలి. ఎలాంటి అనుమతి లేకుండా గోదావరిలో ఇసుకను తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం.

ఆర్థిక సాయం అందజేత

రామకృష్ణాపూర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ట్యూమర్తో బాధపడుతున్న పట్టణానికి చెందిన శ్రీకాంత్ అనే విద్యార్థికి ఆదివారం ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. శ్రీకాంత్ తండ్రి శ్రీనివాస్ కూలి పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. కుమారుడికి ఆర్థిక చేయూత అందించాలని ట్రస్టు సభ్యులను సంప్రదించడంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్ను పరామర్శించి కుటుంబ సభ్యులకు అందించారు. సభ్యులు ప్రేమ్కుమార్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి..

దండేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన రడపాక లచ్చవ్వ 5రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఆదివారం తాళ్లపేట చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ వారి కుటుంబాన్ని పమర్శించి రూ, 5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కుర్సెంగ కళావతి, మర్సుకోల లచ్చుపటేల్,మాజీ ఉప సర్పంచు తిరుపతి, నాయకులు దయాకర్, రాజశేఖర్, నగేష్, మల్లేష్, ప్రభాకర్, సాదిక్ఖాన్, రాజన్న కోటయ్య పాల్గొన్నారు.

పక్షుల సంరక్షణకు భాగస్వాములు కావాలి

● అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ ● ముగిసిన బర్డ్స్ ఫెస్టివల్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పక్షుల సంరక్షణ కోసం ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని, పక్షుల సంరక్షణపై అధ్యయనం జరగాలని, ఇందుకు దీర్ఘకాలిక పరిశీలన అవసరమని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ పేర్కొన్నారు. అటవీశాఖ, వైల్డ్లైఫ్ ఫండ్, నేచ ర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో మంచిర్యాలలో రెండు రోజులుగా జరిగిన బర్డ్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొన్ని జాతుల పక్షుల వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి వలస వెళ్తుంటాయని ఇలాంటి పక్షులను కాపాడు కోవాల్సిన అవసరం ఉందన్నారు. పక్షులు మాన వాళి మనుగడకు, పర్యావరణానికి ఎంతో జీవ వైవిధ్యం ప్రదర్శిస్తూ మానవాళి మనుగడకు, పర్యావరణానికి ఎతో మేలు చేస్తున్నాయన్నారు. ప్రకృతి ఇచ్చిన గొప్ప వరం పక్షులని తెలిపారు. వాటి భాషలో మంచి కమ్యూనికేషన్ కలిగి రాకపోకలు కొనసాగిస్తూ పర్యావరణంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నాయ న్నారు. పక్షుల స్థితిగతులు వాటి జీవన విధానంపై విద్యార్థులకు క్విజ్లు నిర్వహించాలన్నారు. జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్సింగ్ మాట్లాడుతూ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఎన్నో వేల పక్షులు సంచరిస్తున్నాయన్నా రు. రెండు సంవత్సరాలుగా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ సహకారంతో జన్నారం అటవీ డివిజన్లో దీర్ఘకాలిక పరిశీలన చేసి 201 జాతుల పక్షులను గుర్తించామన్నారు. ఆసిఫాబాద్ జిల్లా అటవీ అధికారి నీరజ్టి బ్రేవాల్ మాట్లాడుతూ కాగజ్నగర్ డివిజన్ అటవీ ప్రాంతంలో రాష్ట్రంలోనే అరుదైన రాబందుల సంరక్షణకు తాము తీసుకుంటున్న చర్యల వల్లే వాటి జనాభా పెరుగుతుందన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్స్ శాస్త్రవేత్త మహేష్ శంకరన్ మాట్లాడుతూ గడ్డి మైదానాలకు, అడవులకు మధ్య వ్యత్యాసాన్ని, అక్కడి జీవ వైవిధ్యం గురించి వివరించారు. వరల్డ్ వైల్డ్ లైఫ్ఫండ్ ప్ర ధాన అధికారి బండి రాజశేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అటవీ శాఖ సహకారంతో జన్నారం అటవీ డివిజన్లో పక్షుల అధ్యయనంపై సమగ్ర పరిశీలన చేయగా 11 పక్షి జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయని, 57 జాతుల పక్షులు కేవలం అటవీ ప్లాంటేషన్ ఏరియాల్లో సంచరిస్తున్నాయని పరిశీలించామన్నారు. అనంతరం పక్షుల సంరక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వహకులకు అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ, శాస్త్రవేత్త రాబిన్ విజయన్, కవ్వాల టైగర్ రిజర్వు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శాంతారాములు జ్ఞాపికలు అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా అటవీ అధికారి ప్రశాంత్కుమార్పాటిల్, మంచిర్యా ల ఫారెస్టు డివిజనల్ అధికారి సర్వేశ్వర్రావు, ప్రముఖులు డాక్టర్ శాంతారామ్, బిక్షం గుజ్జు, డాక్టర్ సాధియా సెల్వం, సంజీవ్ మీనన్, ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలోని ఫారెస్టు రేంజ్ అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛంద సంస్థ సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఫారెస్టు అధికారులు

జన్నారం : మంచిర్యాలలోని కలెక్టరేట్లో జరిగిన బర్డ్ ఫెస్టివల్కు మండలంలోని వివేకానంద, రాఘవేంద్ర లిటిల్ హ్యాండ్స్, స్లేట్ హైస్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు వివిధ రకాల పక్షులపై వివరించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. డీఎఫ్వో శివ్ఆశిష్సింగ్ విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు.

చెత్తాచెదారంతో నిండిన కాలువలు

అందని సాగునీరు..ఇబ్బందుల్లో రైతులు

దండేపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగు కోసం ఎల్లంపల్లి గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా అందించే సాగునీరు ఆయకట్టు చివరి పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడతున్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు, ఉప కాలువల్లో చెత్తచెదారం తట్టుకుని సాగునీరు ముందుకు వెళ్లకపోవడంతో సకాలంలో పంటలకు సాగునీరు అందక ప్రతియేటా రైతులు నష్టపోతున్నారు. దండేపల్లి మండలం తానిమడుగు శావారులోని కడెం ప్రధాన కాలువ గుండా 30 వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా ఆయకట్టు పంటలకు అందించే సాగునీటి కాలువలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండిపోయింది. నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తానిమడుగు నుంచి మొదలు వెల్గనూర్ దాకా డిస్ట్రిబ్యూటరీ కాలువంత చెత్తచెదారంతో నిండి పిచ్చి మొక్కలతో నిండిపోయి గడ్డి ఎపుగా పెరిగి సాగునీరు ముందుకు వెళ్లక కాలువ ఓ ప్రకృతి వనంగా తలపింపజేస్తుంది. 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా తానిమడుగు, చింతపల్లి, నెల్కివెంకటాపూర్, వందూర్గూడ, రెబ్బనపల్లి, వెల్గనూర్, తదితర గ్రామాలకు ఆయకట్టు పంటలకు డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా కడెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాల్సి ఉందన్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రతియేట ఆయకట్టు చివరి పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాక ముందే సాగు నీటి కాలువలో పూడికతీత, పిచ్చి మొక్కలు, చెత్తచెదారం తొలగింపు చర్యలు చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు.

ఇప్పటి కైన అధికారులు దృష్టి సారించి 30వ డిస్ట్రిబ్యూటర కాలువల్లో పూడిక తీత, చెత్తచెదారం, పిచ్చి మొక్కల తొలగింపు చర్యలు చేపట్టి ఆయకట్టు చివరి పంటలకు సాగునీరు అందించే విధంగా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



రెబ్బనపల్లి గ్రామ శివారులో కల్వర్టు వద్ద చెత్తచెదారంతో నిండిన సాగునీటి ఉప కాలువ

ఎవరి ధీమా వారిదే..?

(5వ పేజీ తరువాయి)

శైలిలో ప్రచారం నిర్వహించారు. ఆయనకు మద్దతుగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రచారంలో పాల్గొన్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల విభాగంలో బీఎస్పీ తరుపున బరిలో దిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రసన్న హరిక్రిష్ణ తన దైన శైలిలో ముందుకెళ్లారు. ప్రసన్న హరిక్రిష్ణ బీఎస్పీ తరుపున బరిలో నిలువడంతో నియోజకవర్గంలోని ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు మద్దతు పలికారు. దీంతో చాప కింద నీరులా ఆయన ప్రచారం ఊపందుకోగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా నిలిచారు. ప్రసన్న హరి క్రిష్ణకు బీసీ ఓటర్లు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు లభించాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే సౌమ్యుడిగా పేరున్న ప్రసన్న హరిక్రిష్ణకు బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు సంపూర్ణ మద్ధతు పలికారనే ప్రచారం జోరుగా సాగుతుంది.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ వైపే ఓటర్ల మొగ్గు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ విభాగంలో బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకే ఓటర్లు మొగ్గు చూపారన్న ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో బీజేపీ తరుపున మల్క కొమురయ్య... పీఆర్టీయు టీఎస్ తరుపున వంగ మహేందర్రెడ్డి, పీఆర్టీయు తెలంగాణ తరుపున రఘోత్తం రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా ఇన్నారెడ్డి బరిలో దిగారు. అయితే బీజేపీ తరుపున బరిలో దిగిన మల్క కొమురయ్యకే ఆయా సంఘాల తరుపున పట్టం కట్టినట్లు ప్రచారం జరుగుతోంది. నేటి ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం సాధిస్తారనే ప్రచారం జోరుగా ఉంది.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి..

కాగా సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ, పట్ట భద్రులు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టభద్రుల ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 21 టేబుళ్లను ఏర్పాటు చేయగా ఉపాధ్యాయుల ఓట్లను లెక్కించేందుకు 14టేబుళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి టేబుల్కు ఒక మైక్రో అబ్జర్వర్తో పాటు ముగ్గురి సిబ్బందిని కేటాయించారు. కాగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు కరీంనగర్పోలీసు కమిషనరల్ నేతృత్వంలో పకడ్బంది ఏర్పాట్లు చేశారు.

సైన్స్ ఫెయిర్లో విద్యార్థుల ప్రతిభ



గైడ్ టీచర్తో పాటు విద్యార్థులు

కోటపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : హైద్రాబాద్లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రూరల్ డెవలప్మెంట్ సెంటర్ అండ్ ప్రయాస్ ఆధ్వర్యంలో ఈ నెల 1న నిర్వహించిన సృష్టి సైన్స్ ఫెయిర్లో మండలంలోని అన్నారం పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చినట్లు గైడ్ టీచర్ సురేందర్ తెలిపారు. విద్యార్థులు పి. శ్రావణ్, జె. శ్రావణ్కుమార్, డి. చరణ్తేజ పాల్గొని ఉత్తమ ప్రదర్శన చేసి 7వ స్థానంలో నిలిచి ఫ్యూచర్ ఇన్నోవేట్ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన వీరిని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, కలెక్టర్ క్రాంతితో పాటు రూరల్ డెవలప్ మెంట్ సెంటర్ డైరెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మందమర్రి జీఎం క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి జీఎం దేవేందర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికుని సమస్యపై చర్చించేందుకు వెళ్లిన తమ పార్టీ కార్యవర్గ సభ్యుడు, బెల్లంపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి దాగం మల్లేష్పై జీఎం దేవేందర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. వెంటనే మల్లేష్కు జీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. పట్టణ సహాయ కార్యదర్శి రాజేష్, నాయకులు బాపు, చంద్ర మాణిక్యం, రాజం, కొమురయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాల 2001-02 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్హాలులో ఘ నంగా నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత విద్యార్థులందరు ఒక్క చోట కలుసుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమ శిక్షణ చదువుతోనే ఇప్పుడు వివిధ స్థాయిల్లో ఉన్నామని విద్యార్థులు తెలిపారు. పాఠాలను నేర్పిన గురువులను సన్మానించారు.

వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్

మంచిర్యాల క్రైం, మార్చి2 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల వినియోగదారుల జిల్లా అధ్యక్షుడిగా బాదే రాజశేఖర్ను ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు ఎన్నుకున్నారు. పాత మంచిర్యాలటి కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు వినియోగదారులు జిల్లా అధ్యక్షుడిగా బాదె రాజశేఖర్ను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి కిరణ్కుమార్, కార్యదర్శి ఆర్. రాజేశ్, జాయింట్ సెక్రటరి ప్రభాకర్, వినోద్, తన్నీరు హేమలత, పానుగంటి శివ పాల్గొన్నారు.





జీవితంలో 'సెట్' కావాలంటే...
● ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసిన ప్రభుత్వం
● విద్యార్థుల సన్నద్ధతే కీలకం 7
ఆధార్ అవస్థలు.. 6


డీజే సౌండ్స్ పెడితే చర్యలు

నస్పూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో నస్పూర్ పట్టణంలో డీజే సౌండ్స్, ఇతర్రాత సౌండ్స్ పెట్టి ఊరేగింపులు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని మంచిర్యాల రూరల్ సీఐఅశోక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోమవారం నుంచి పట్టణంలో డీజేసౌండ్స్‌తో ర్యాలీ చేయవద్దని, డీజే సౌండ్స్‌పై నిషేదం ఉన్నదన్నారు. డీజే సౌండ్స్ వలన విద్యార్థులకు ఇబ్బంది కలుగు తుందన్నారు. వచ్చేనెల 4వ తేదీ వరకు నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని సీఐ తెలిపారు.

అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో మందమర్రి యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకొని కేక్‌కట్‌చేసి తినిపించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మందమర్రి యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారం కిరణ్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన శివచరణ్ రెడ్డికి యూత్ కాంగ్రెస్ పటిష్టతతో పాటు ప్రభుత్వం చేప డుతున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృ తంగా ప్రచారం చేసే అంశాలపై చర్చించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో మందమర్రి యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎవరి ధీమా..వారిదే..?



● నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
● గెలుపోటములపై ఆశావహుల అంచనాలు
● పట్టభద్రుల ఎన్నికల్లో విజయంపై అభ్యర్థుల ధీమా

మంచిర్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియడం... నేడు ఓట్ల లెక్కింపు చేపట్టనుండడంతో అభ్యర్థులు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ఫలితాలు అన్ని పార్టీల్లో ఉత్కంఠ రేపుతుండగా గెలుపోటములపై అభ్యర్థులు లెక్కలు వేస్తున్నారు. ఎన్నికల్లో ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు విజయంపై నమ్మకం వ్యక్తం చేస్తుండగా తామే గెలుస్తామన్న ఆలోచన పోటీ దారుల్లో నెలకొని ఉంది. పట్ట భద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి, బీజేపీ తరుపున చిన్నమైల్ అంజిరెడ్డి, బీఎస్పీ తరుపున అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న, హరిక్రిష్ణ బరిలో దిగారు. మొత్తం 56 మంది అభ్యర్థులు పట్ట భద్రుల ఎన్నికల్లో పోటిలో దిగగా ప్రధానంగా ముగ్గురి మధ్యన నువ్వా...నేనా అన్న చందంగా ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ అభ్యర్థి తరుపున సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు ప్రచారం నిర్వహించగా బీజేపీ తరుపున కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొన్నారు. కాగా బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరిక్రిష్ణ ఒంటరిగా బరిలో దిగి ప్రధాన పార్టీల అభ్యర్థులతో తనదైన శైలిలో ప్రచారం నిర్వహించారు.

సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం ఫలించేనా..

కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి బరిలో దిగినప్పటికీ మొదట్లో ఆయనకు పెద్దగా ఓటర్ల నుంచి మద్దతు లభించలేదు. దీంతో తన విద్యా సంస్థల్లో పని చేస్తున్న గ్రాడ్యుయేట్లపై ఆయన ఆధారపడి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలను అప్రమత్తం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్రమత్తమైన ఎమ్మెల్యేలు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ ని యోజకవర్గాల్లో పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారు ఎన్నికలకు సరిగ్గా నాలుగైదు రోజుల ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒక్కతాటిపైకి రావడం, ప్రచారంలో ముమ్మరంగా పాల్గొనడంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతుగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రేవంత్ సభతో పట్టభద్రుల్లో మార్పు రాగా నరేందర్ రెడ్డి గెలుపునకు ఖాయమనే సంకేతాలు వెలువెడ్డాయి. అలాగే బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి సైతం తనదైన శైలిలో..

మిగతా 7లో

వర్క్‌షాప్‌తో పక్షులపై అవగాహన

ఎఫ్ఆర్‌వో సుష్మారావు



పక్షుల కూతలను రికార్డు చేస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసర్చ్ సెంటర్ విద్యార్థులు

జన్నారం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : అటవీ అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించడం వలన పక్షులు, వాటి జాతులపై ఒక అవగాహన వస్తుందని ఎఫ్ఆర్‌వో సుష్మారావు అన్నారు. కవ్వాల అభయారణ్యంలోని జన్నారం రేంజ్‌లోని బైసన్‌కుంట వద్ద ఆదివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసర్చ్ సెంటర్ (ఐఐఎస్ ఈఆర్) అధికారి తిరుపతి ఆధ్వర్యంలో పక్షుల కూతల రికార్డింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో సుష్మారావు మాట్లాడుతూ అభయారణ్యంలోని పక్షులు, వాటి జాతుల పై రీసర్చ్ నిర్వహించేందుకు నలుగురు విద్యార్థులతో కూడిన బృందం జన్నారంలోని 15 మంది అటవీ అధికారులకు శిక్షణ (వర్క్‌షాపు) నిర్వహించారని తెలిపారు. పక్షి జాతులు వాటి కూతలు రికార్డింగ్ చేయడం వల్ల ఎన్ని రకాలు ఉన్నాయో తెలిసిపోతుందన్నారు. ఈ వర్క్‌షాపు వల్ల స్థానిక అటవీ అధికారులకు సైతం పక్షుల గురించి తెలుస్తుందన్నారు. అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపు



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

కన్నెపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండలంలోని పోలంపల్లి స్టేజ్ దగ్గర మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికీ అక్కడ నాలుగు ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మూల మలుపు వద్ద గత సంవత్సరం ట్రాక్టర్, ఆటో ఢీకొని ఇద్దరు మృతి చెందారు. అలాగే కొద్ది రోజుల క్రితం ఆటో బోర్లా పడడంతో బెల్లం పల్లికి చెందిన ఆటో డ్రైవర్ ఈ ప్రమాదంలో మృతిచెందాడు. ఫిబ్రవరి 25న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వీగాం గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి మృతిచెందాడు. మూల మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయ ని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని మూల మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులో ఏర్పాటు చేయాలని, ప్రజలు కోరుతున్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

● అదనపు కలెక్టర్ మోతీలాల్

జైపూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. వసతి గృహం తనిఖీల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే బాల్యంలోనే శ్రద్ధగా చదువుకోవాలన్నారు. వసతి గృహంలో సమస్యలుంటే వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. మెను ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగా సమాధానాలు రాబట్టారు. భోజనం రుచికరంగా ఉండడంతో కుక్‌ను అభి నందించారు. వసతగృహం చుట్టూ పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉన్నాయని, ఇలాగే శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహంలో విద్యార్థులతో కలిసి నిద్రించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్ గౌడ్, వార్డెన్ సాయి లచ్చన్న పాల్గొన్నారు.



జైపూర్ వసతి గృహంలో విద్యార్థులతోకలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

వసతి గృహం పరిశీలన

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ శనివారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు.

ఈసందర్భంగా ఆయన వసతి గృహంలో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. వచ్చే పదవతరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత రావాలని తల్లితండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. వసతిగృహ పరిసరాలు, వసతి గృహంలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రాత్రి విద్యార్థులతో కలిసి హస్టల్ లోనే నిద్రించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీబీసీడీవో పురుషోత్తం, డీఆర్పీ జనార్దన్, వార్డెన్ శ్రీనివాస్ ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

లక్సెట్టిపేట, మార్చి 02(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో కన్నెపల్లి జిన్నింగ్ మిల్లులో కొనసాగుతున్న పత్తి కొనుగోళ్లను ఈరోజు నుండి నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటి కార్యదర్శి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిలువలు, పత్తి విత్తనాల నిలువలు ఎక్కువగా ఉన్నందున నిలువ చేసుకునేందుకు స్థలం లేనందున కొనుగోళ్లను నిపివేయడం జరుగుతుందని తిరిగి పత్తి కొనుగోలు తేదీని పత్రిక ముఖంగా తెలియజేయడం జరుగుతుందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

కళాప్రదర్శనలతోనే ప్రజా చైతన్యం

మందమర్రిటౌన్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): కళా ప్రదర్శనలతోనే ప్రజా చైతన్యం సాధ్యమని ప్రజలకు దోహదపడే కళలను కళాకారులు ముందుకు తీసుకెళ్లాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఈనెల 4న మందమర్రిలో క్రేజీస్టార్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న క్రేజీస్టార్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డులో ప్రధాన కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. ఆయా రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అకాడమి ద్వారా అవార్డులు అందజేయడం గొప్పవిషయమని తెలిపారు. అకాడమి వ్యవస్థాపకుడ జాతీయ కళాకారుడు అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజాకవి దరువు ఎల్లన్నతో పాటు పలువురు యూట్యూబ్ స్టార్స్ తదితరులు హాజరుకున్నారని పేర్కొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సభ్యులు ఉప్పులేటి నరేశ్, చకినాల శంకర్, కలువల శ్రీనివాస్, రాకం సంతోష్, కొండపర్తి సది తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం శాసనసభ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ కుమార్‌దీపక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీపీవో వెంకటేశ్వర్, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని శ్రీరాంపూర్ ఏరియా జీ ఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. శ్రీపాదరావు జయంతిని పురస్కరించుకొని జీఎం కార్యాలయం ఆవరణలో వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఓసీపీ పీవోటి. శ్రీనివాస్, ఆర్కే 5, 6గ్రూప్ ఏజెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

జైపూర్ : మండల ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు సుమన్, ఉదయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్‌లు తిరుపతి, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : ఎంపీడీవో కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం : మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సానిటరి ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

●రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలను సీపీ శ్రీనివాస్ నిర్వహించారు.

చెరువులో పక్షుల కిలకిలలు

● బర్డ్‌లేక్ విలేజ్‌గా వెంకట్రావుపేట చెరువు
● 97జాతుల పక్షుల రాగాలు
● తొలి బర్డ్స్ విలేజ్‌గా గుర్తింపునకు అధికారుల కసరత్తు



చెరువు నీటిపై ఎగురుతున్న పక్షులు

లక్సెట్టిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండంలోని వెంక ట్రావుపేట గ్రామం ఊర చెరువులో పక్షుల కేరింతలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దేశ విదేశాల్లో కనిపించని పక్షులు ఇక్కడి చెరు వులో దర్శనమిస్తున్నాయి. సుమారు 90కి పైగా వివిధ జాతులకు చెందిన పక్షులు ఇక్కడి చెరువులో సందడి చేస్తూ పలువురిని ఆకర్షితులను చేస్తున్నాయి. నిత్యం కొన్ని వేల సంఖ్యలో పక్షులు ఇక్కడ అవాసం ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈచెరువు సుమారుగా 128ఎకరాల్లో ఉండటంతో పాటు చెరువు ఎప్పుడు నిండు కుండలా నీటితో దర్శనం ఇస్తుంది. వర్షాకాలంతో పాటు ఎండాకాలం కూడా మండుటెండలు ఉన్నప్పటికీ చెరువులో నీరు మాత్రం తగ్గకుం డా ఉంటుంది. మత్స్యకారులు ఎంతో మంది ఈచెరువునే నమ్ముకుని జీవిస్తున్నారు. ఇటీవల బర్డ్‌ఫెస్టివల్‌లో భాగంగా అటవీశాఖ అధికా రులు ఈచెరువును వీక్షిస్తున్న క్రమంలో అనేక పక్షులు దర్శనం ఇవ్వ డం విశేషంగా మారింది. ఈచెరువు చుట్టూ 400ఎకరాల్లో ఆయకట్టు ఉండటంతో పక్షుల కేరింతలకు అడ్డు లేకుండా ఉంది. గ్రామంలో చాలా మంది వేకువ జామున మనశ్శాంతి కోసం పక్షుల సందడి చూసేందుకు చెరువు వద్దకు వచ్చి సేదతీరుతుంటారు. ఇటీవల అధి కారులు గ్రామాన్ని వీక్షించి రాష్ట్రంలోని ఈచెరువుని తొలి బర్డ్ విలేజ్ గా గుర్తించాలని అటవీ శాఖ అధికారులు నివేదికను కూడా ఉన్నతా ధికారులకు పంపించేందుకు సిద్ధం చేసినట్టు తెలిసింది. అందులో భాగంగా ఆదివారం వేకువ జామున పక్షులను వీక్షించేందుకు పీసీసీ ఎస్ సువర్ణ, ఎఫ్‌డీపీటి శాంతారావు, డీఎఫ్‌వో శివ ఆసీస్సుతో పాటు లక్సెట్టిపేట రేంజ్ అధికారి సుభాష్ సిబ్బందితో కలిసి చెరువును సందర్శించారు. పక్షుల కేరింతలు వీక్షించి వాటి చిత్రాలను కెమెరాల్లో బంధించారు. విదేశాల్లో ఉండే పక్షులు ఇక్కడ ఉన్నట్లుగా గుర్తించారు.





పక్షుల చిత్రాలను ఫొటోల్లో బంధిస్తున్న అధికారులు

97కిపైగా జాతుల పక్షులను గుర్తించాం..

అత్తె సుభాష్, ఎఫ్ఆర్వో, లక్సెట్టిపేట

వెంకట్రావుపేట గ్రామం చెరువులో సుమారు 97కి పైగా వివిధ జాతుల పక్షులను గుర్తించాము. విదేశాల్లో సంచరించే పక్షులైన బ్లూఫేస్డు మాల్కోవా, రెడ్ నెక్ట్ మాల్కవ్ లాంటి పక్షులు ఇక్కడ సంచరిస్తున్నాయి. బ్లూఫేస్డు మాల్కోవా పక్షులు ఎక్కువగా ఇండియాతో పాటు శ్రీలంకలో ఉంటాయి. మన ప్రాంతంలో కూడా సం చరించడంతో వెంకట్రావుపేట గ్రామాన్ని తొ లి బర్డ్ లేక్ విలేజ్‌గా గుర్తించేందుకు సన్నా హాలు చేపడుతున్నాం.